Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in | సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు :3

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

సోమవారం 20/07/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

# ఆగస్టు 3 వరకు నేతలు గాంధీభవన్‌కు రావొద్దు

- సర్‌పై కాంగ్రెస్ జూమ్ సమావేశం
- పార్టీ ముఖ్యనేతలకుసీఎం రేవంత్ రెడ్డి కీలక సూచనలు

**టి మీడియా, జులై 19,హైదరాబాద్ బ్యూరో :**
చైర్మన్, ఇతర పదవుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరిగే నాయకులకు ఇకపై అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దని, రేపటి నుంచి ఆగస్టు 3తేదీ వరకు ఎవ్వరూ గాంధీభవన్‌కు రావొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ అంశంపై కాంగ్రెస్ పార్టీ నాయకులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో పార్టీ నాయకత్వానికి ఎస్ఐఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

### నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

సోమవారం నుంచి పది మంది ఇన్‌ఛార్జి మంత్రులు అన్ని జిల్లాల్లో ఎస్ఐఆర్‌పై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారని, పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఎంపీలు కూడా ఎప్పటికప్పుడు సమీక్షలు కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇన్‌ఛార్జీలుగా ఉన్న చోట ఎంపీలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించడం కాంగ్రెస్ పార్టీకి వచ్చిన కీలక అవకాశమని, ప్రతి నాయకుడు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇప్పటికే 489 సమావేశాలు నిర్వహించినప్పటికీ, వెనుకబడిన నియోజకవర్గాల్లో



ఇప్పటికైనా చురుకుదనం చూపించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### పరస్పర సమన్వయంతో ముందుకెళ్లాలి

పార్టీ పరంగా ఎస్ఐఆర్ ఇన్‌ఛార్జీలుగా పనిచేస్తున్న నాయకులు పరస్పర సమన్వయంతో ముందుకెళ్లాలని, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, చైర్మన్లు బీఎల్ఓల నివేదికల కంటే బీఎల్ఏల నివేదికలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. కేవలం బీఎల్ఓల నివేదికలపైనే ఆధారపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ తరఫున పనిచేస్తున్న బీఎల్ఏలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నాయకులంతా పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండాలని, హైదరాబాద్‌లోనే ఉంటే పనులు సాగవని స్పష్టం చేశారు. వచ్చే పది రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో ప్రతి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ప్రతినిధులకు ఆదేశాలు జారీ చేశారు.

### ఎస్ఐఆర్‌పై ఇన్‌ఛార్జి మంత్రులదే బాధ్యత

గాంధీభవన్ బృందం ఎప్పటికప్పుడు బీఎల్ఏ, బీఎల్ఓ నివేదికలను పరిశీలించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇన్‌ఛార్జి మంత్రులే పూర్తి బాధ్యత తీసుకోవాలని సీఎం రేవంత్ సూచించారు. ఈ నెల 30వ తేదీన మరోసారి పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించి, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు పరిశీలిస్తామని తెలిపారు. అలాగే పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరింత బాధ్యత తీసుకుని ఇన్‌ఛార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జిల మధ్య సమన్వయం తీసుకురావాలని సూచించారు. ఎస్ఐఆర్‌ను ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, అత్యుత్తమంగా పనిచేసే 100 మంది బీఎల్ఏలకు రాహుల్ గాంధీని కలిసి ఫోటో దిగే అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఉదయం జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జూమ్ సమావేశంలో రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, ఎస్ఐఆర్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# జమ్ముకశ్మీర్‌లో వరద బీభత్సం



- 17 మంది మృతి- పలువురు గల్లంతు

**టి మీడియా, జులై 19, ఢిల్లీ బ్యూరో :**
జమ్ముకశ్మీర్‌లోని సరిహద్దు జిల్లాలైన పూంచ్, రాజౌరిలో ఆదివారం కురిసిన భారీ వర్షాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో కనీసం 17 మంది ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. రహదారులు దెబ్బతినడం, వాగులు ఉప్పొంగడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నప్పటికీ, పలు ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా సహాయక చర్యలను కొనసాగిస్తున్నాయి. మరోవైపు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తన ఢిల్లీ పర్యటనను మధ్యలోనే ముగించుకుని జమ్ముకు తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు.

### పూంచ్ జిల్లాలోని సురన్‌కోట్ తహసీల్ అత్యంత

తీవ్రంగా ప్రభావితమైంది. లోయర్ ముర్రా గ్రామంలో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి ఓ ఇంటిపై పడింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న ఎనిమిది మంది శిథిలాల కింద చిక్కుకున్నారు. రెస్క్యూ సిబ్బంది ఐదుగురి మృతదేహాలను వెలికితీశాయి. వీరిలో రెండేళ్ల చిన్నారి కూడా ఉంది. అదే తహసీల్?లోని సంగ్లా గ్రామంలో ఆకస్మిక వరదల ధాటికి మరో ఇల్లు పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గల్లంతయ్యారు. సంగ్లా గ్రామంలో ఆకస్మిక వరదల ధాటికి మరో ఇల్లు పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గల్లంతయ్యారు. వర్షాలు పడుతున్నప్పటికీ స్థానిక పరిపాలన, పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు, ఇతర ప్రభుత్వ శాఖలు కలిసి సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతుండగా, ప్రమాదకర ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గాయపడిన వారికి వైద్యసేవలు అందిస్తున్నారు.

### రాజౌరిలోనూ వరదల ప్రభావం

రాజౌరి జిల్లాలోనూ రాత్రంతా కురిసిన వర్షాలకు నదులు, వాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు చేరడంతో వందలాది కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలాల్సి వచ్చింది. రాజౌరి పట్టణంలో నది ప్రవాహంలో ఓ మహిళ మృతదేహం లభించింది. వాహనాలు వరద ప్రవాహంలో కొట్టుకుపోవడం, మరికొన్ని నీటిలో మునిగిపోవడంతో రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు ప్రాంతాల్లో ఇళ్లు, దుకాణాలు, వ్యవసాయ భూములు, రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. విద్యుత్, తాగునీటి సరఫరాపైనా ప్రభావం పడింది. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజా, ప్రైవేటు ఆస్తులకు భారీ నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పూర్తి స్థాయి నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు.

### పరిస్థితిని సమీక్షించిన సీఎం, ఎల్‌జీ

మరోవైపు లెఫ్టినెంట్ గవర్నర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కూడా సంబంధిత అధికారులతో పరిస్థితిని సమీక్షించి, బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు. సహాయక చర్యల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఢిల్లీలో ఉన్న పర్యటనను మధ్యలోనే ముగించుకుని జమ్ముకు తిరిగి వెళ్లాలని నిర్ణయించారు. వాతావరణ పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నందున క్షేత్రస్థాయిలో పరిస్థితిని స్వయంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ప్రాణాల రక్షణ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని, నష్టపోయిన కుటుంబాలకు అవసరమైన అన్ని విధాలా సహాయం అందిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్?షా ఆదివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం బంగాల్? పర్యటనలో ఉన్న ఆయన జమ్ముకశ్మీర్? లెఫ్టినెంట్ గవర్నర్, సీఎంతో ఫోన్‌లో మాట్లాడారు.

# ట్యూషన్ ఫీజు వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరచాలి

- స్కూళ్లకు విద్యాశాఖ ఆదేశాలు

**టి మీడియా, జులై 19,హైదరాబాద్ బ్యూరో :**
రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసే పనిలో ఉంది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ శనివారం ఒక ఆదేశం జారీ చేశారు. దీని ప్రకారం పాఠశాలలు ప్రస్తుత విద్యా సంవత్సరానికి (2026-27) సంబంధించిన తరగతుల వారీగా వసూలు చేసే ట్యూషన్ ఫీజు వివరాలను తమ నోటీసు బోర్డులు, వెబ్‌సైట్‌లలో తప్పనిసరిగా ప్రదర్శించాలి. అలాగే 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించిన వార్షిక పరిపాలనా నివేదికలు చార్టర్డ్ అకౌంటెంట్ ధృవీకరించిన ఆడిట్ నివేదికలను, ఈ నెల 30వ తేదీలోపు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు.

### సమర్పించకపోతే షోకాజ్ నోటీసులు

ఉమ్మడి రాష్ట్రంలో 1994 జనవరి 1న జారీ చేసిన జీవో నం.1 ప్రకారం పాఠశాలలు ఏటా విద్యాశాఖకు ఆడిట్ నివేదికలను సమర్పించాల్సి ఉంటుంది. అయితే ఇన్ని సంవత్సరాలు విద్యాశాఖ వాటిని అడగలేదు. అలాగే పాఠశాలలు కూడా సమర్పించలేదు. ఇప్పుడు వాటిని సమర్పించాలంటూ అధికారిక ఆదేశాలు జారీ కావడం గమనార్హం. గడువులోగా నివేదికలు సమర్పించకపోతే సంబంధిత పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకోవాలని నవీన్ నికోలస్ ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులకు స్పష్టం చేశారు.

### ఇప్పుడే ఎందుకు?

రాష్ట్రవ్యాప్తంగా 12,000 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చాలా పాఠశాలలు ఏటా ఇష్టానుసారంగా ఫీజులను




పెంచుతున్నాయని, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఈ ఫీజులను నియంత్రించేందుకు చట్టం తీసుకురావాలని ప్రభుత్వం రెండేళ్ల క్రితమే నిర్ణయించింది. రెండేళ్లకు ఒకసారి 8 శాతం ఫీజు పెంపును ప్రతిపాదిస్తూ ఏడాదిన్నర క్రితమే ముసాయిదా బిల్లును సిద్ధం చేశారు. ప్రజల నుంచి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించేందుకు ఈ ముసాయిదాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఫిబ్రవరిలో ఆదేశించారు. కానీ అది ఇంకా కార్యరూపం దాల్చలేదు.

### 2027-28 నాటికి ఫీజు నియంత్రణ చట్టం


ఇటీవల ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ఎన్ శ్రీధర్ అధికారులతో ఫీజు నియంత్రణపై చర్చించి ప్రస్తుత ఫీజు వివరాలతోపాటు ఇతర సంబంధిత సమాచారాన్ని సేకరించాలని ఆదేశించినట్లు సమాచారం. అదేవిధంగా తరగతుల వారీగా ఫీజు వివరాలను ప్రదర్శించాలని ఆడిట్ నివేదికలను సమర్పించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ముసాయిదా బిల్లుపై ప్రజల అభిప్రాయాలను సేకరించి మంత్రివర్గంలో చర్చించిన తర్వాత శాసనసభలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది.

# పోలవరం ప్రాజెక్టు పూర్తికి

- 43 అంశాలతో చెక్ లిస్ట్

**టి మీడియా, జులై 19 పోలవరం :**
పోలవరం ప్రాజెక్టును 2027 మార్చికి పూర్తిచేసే లక్ష్యంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే అధికారులు సూక్ష్మస్థాయి ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో భాగంగా మొత్తం 43 అంశాలను గుర్తించారు. వీటి పూర్తికి ఇంకా 8 నెలలే గడువుంది. వీటిలో ప్రధాన డ్యాం గ్యాప్ 1, గ్యాప్ 2 పూర్తిచేయడంలో ఇంకా వివిధ దశలు ఉన్నాయి. డిజైన్లు, అవసరమైన మెటీరియల్ సమీకరణ, స్పిల్ వే సుందరీకరణ, ఎడమ, కుడి కాలువలతో అనుసంధాన పనులు, పోలవరం స్పిల్ వేకు సమాంతరంగా ఎడమ, కుడి గట్టులను కలిపేలా ఐకానిక్ వంతెన, కేబుల్ వంతెన నిర్మించాలి.


దీంతోపాటు కుడి, ఎడమ కాలువల అనుసంధాన పనులు, ఆ రెండు కాలువల్లో మిగిలి ఉన్న పనులు సహా మొత్తం 43 అంశాలను సూక్ష్మ ప్రణాళికలో పొందుపరిచారు. ప్రధాన డ్యాంలో డిజైన్ల పెండింగ్ అంశాల నుంచి అన్నింటికీ స్థానం కల్పించారు. ఇందులో ప్రధాన డ్యాంతో పాటు అనుబంధ పనుల ప్రణాళిక ఈ విధంగా ఉంది. వీటిలో గ్యాప్ 1, గ్యాప్ 2 డ్యాంల నిర్మాణం పూర్తిచేయడమే అన్నింటికన్నా ముఖ్యమైన లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్యాప్ 2



డ్యాంలో కుడి డ్యాం అబెట్‌మెంట్ పనులకు డిజైన్లు సమర్పించారు. జులై నెలాఖరుకు వీటికి అనుమతులు వస్తాయని భావిస్తున్నారు. ఇదే డ్యాంకు సంబంధించి ప్రస్తుతం ०23.32 మీటర్ల స్థాయి వరకే అనుమతులు లభించాయి. ఆపైన ०53.32 మీటర్ల వరకు డిజైన్లను కేంద్ర జలసంఘానికి సమర్పించారు. ఈ నెలలో వీటి అనుమతులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు గ్యాప్ 2 ప్రధాన డ్యాంలో 80 మీటర్ల చైనేజి నుంచి 1450 మీటర్ల చైనేజి వరకు పనుల తీరుపై అధికారులు సంతృప్తిగా ఉన్నారు. ప్రస్తుతం ०17 మీటర్ల స్థాయి నుంచి ०23.32 మీటర్ల ఎత్తు వరకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. జులై నెలాఖరుకు గ్యాప్ 2 డ్యాం మొత్తం ఈ స్థాయికి తీసుకొచ్చి ०53.32 మీటర్ల ఎత్తుకు పనులు మొదలు పెట్టాలి. ०23 మీటర్ల స్థాయికి పనులు పూర్తయితే గోదావరి సీపేజీ నీటి నుంచి కూడా పనులకు ఇబ్బంది లేకుండా మిగిలిన పై భాగం సులభంగా చేసుకోవచ్చునేది ఉద్దేశం. గ్యాప్ 1 డ్యాం నిర్మాణం ०33 మీటర్ల వరకు పూర్తయింది. ఆ పై నుంచి ०53.32 మీటర్ల వరకు పనులు చేపట్టారు. ఇది 2027 మార్చి నాటికి పూర్తిచేయాలనేది లక్ష్యం.

మరోవైపు ప్రధాన డ్యాం గ్యాప్ 1, 2 పూర్తిచేసేందుకు ఇంకా మెటీరియల్ అవసరం. అంటే 8.75 లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి మొత్తమ్మీద అవసరం అనుకుంటే ఇప్పటివరకు 2.66 లక్షల క్యూబిక్ మీటర్లు వినియోగించారు. 2.54 లక్షల క్యూబిక్ మీటర్లు డ్యాం వద్ద సిద్ధంగా ఉంది. కావాల్సిన మట్టిలో జులై నెలాఖరుకు మరో 1.50 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి సమీకరిస్తారు. 2027 జనవరి నాటికి 2.05 లక్షల క్యూబిక్ మీటర్లు సిద్ధం చేయనున్నారు. 49.20 లక్షల క్యూబిక్ మీటర్ల రాయి అవసరం. ఇప్పటివరకు 8.70 లక్షల క్యూబిక్ మీటర్లు వినియోగించారు.

# మళ్లీ 'కరోనా' కలకలం - పెరుగుతోన్న కేసులు



- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు జాగ్రత్త పడాల్సిందే!

**టి మీడియా, జులై 19,హైదరాబాద్ బ్యూరో :**
కరోనా మహమ్మారి మరోసారి విజృంభిస్తోంది. ఏపీ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో కేసుల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కరోనా లక్షణాలతో ఏపీలో నలుగురు మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు. వారంతా దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో మధుమేహం, దీర్ఘకాలంగా స్టెరాయిడ్లు తీసుకుంటున్న వారు, క్యాన్సర్?కు చికిత్స తీసుకుంటున్న రోగులు, ఆస్తమా, సీవోపీడీ వంటి వాటితో బాధపడుతున్న వారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలు, వృద్ధులు, గర్భిణుల విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

### ఇదిలా ఉండగా, ప్రస్తుతం కనిపిస్తున్న వైరస్

వేరియంట్‌ను గుర్తించేందుకు శాంపిళ్లను పుణె ల్యాబ్‌కు పంపారు. అయితే దీని గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. కరోనా ఎండెమిక్ స్థాయిలో ఉండటం వల్ల వ్యాప్తి కూడా తక్కువగా ఉంటుందన్నారు

### అప్రమత్తత అవసరం

తాజాగా రాష్ట్రాల్లో కరోనా కేసులు నెమ్మదిగా పెరుగుతున్నాయి. కానీ తెలంగాణలో మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు కాలేదు. గాంధీలో భారీ సంఖ్యలో రోగులకు చికిత్స చేసిన అపార అనుభవం ఉంది. ఒకవేళ కేసులు పెరిగితే ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిపై కరోనా ఎక్కువ ప్రభావం చూపుతుంది. ఇలాంటి వారు గుంపుల్లోకి వెళితే మాస్క్ ధరించడం తప్పనిసరి' అని ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజారావు తెలిపారు. 'చేతి శుభ్రత పాటించాలి. ఎక్కువ మంది గుమిగూడే చోటుకు వెళ్లకూడదు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు వాయిదా వేసుకోవడం మంచిది. ఏడాదికి ఒకసారి ఫ్లూ, న్యూమోకోకల్ వ్యాక్సిన్లు తీసుకోవాలి. ఇక చిన్న పిల్లలు, వృద్ధులు తప్పకుండా ఈ టీకాలు తీసుకోవడం ద్వారా కరోనా నుంచి రక్షణ ఉంటుంద'ని జాగ్రత్తలు సూచించారు.

### మరిన్ని జాగ్రత్తలు

రోజూ కనీసం 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.సరైన నిద్ర, నీళ్లు తాగడం, ఒత్తిడి తగ్గించుకోవడం, సమతుల ఆహారంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గకుండా చూసుకోవాలి.తీవ్రమైన జ్వరం, నొప్పులు, కడుపులో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, శరీరంలో ఆక్సిజన్ శాతం తగ్గడం లాంటి లక్షణాలు ఉంటే మాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రిలో చేర్పించాలి.ఆర్ఎఫ్.5 వేరియంట్‌తో కొత్త కేసులు : ఏపీలో జూన్ 26 నుంచి జులై 16 వరకు నాలుగు జిల్లాల్లో 12 కొవిడ్ కేసులు నమోదైనట్లు ఆ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. వేర్వేరు ప్రాంతాల్లో కొవిడ్ కేసులు వెలుగు చూశాయని, ఒకే చోట గుంపుగా బయటపడలేదని స్పష్టం చేసింది. జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పుణె ల్యాబ్‌కు నమూనాలు పంపించగా, వాటిలో నాలుగింటి ఫలితాలు శనివారం వెల్లడయ్యాయి. దానిలో ఒమిక్రాన్ ఆర్ఎఫ్.5 వేరియంట్‌ను గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. సింగపూర్, ఆగ్నేయాసియా దేశాల్లో ఈ ఆర్ఎఫ్.5 కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు.



# ఉప ముఖ్యమంత్రి భట్టికి ఘన స్వాగతం




- కాంగ్రెస్ శ్రేణుల ఆత్మీయ ఆహ్వానం
- మోటార్ సైకిల్ ర్యాలీతో కార్యకర్తల సందడి

**టీ మీడియా,జూలై19,సింగరేణి(కారేపల్లి):**
రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కారేపల్లి క్రాస్ రోడ్‌లో కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి.ఆదివారం ఇల్లందు నియోజకవర్గ పర్యటనకు వెళ్తున్న సందర్భంగా కారేపల్లి మీదుగా ప్రయాణించిన భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ నాయకులు,ప్రజాప్రతినిధులు శాలువాలు కప్పి,పూలమాలలు వేసి ఆత్మీయంగా ఆహ్వానించారు.పర్యటనలో భాగంగా కామేపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన అనంతరం భట్టి విక్రమార్క కారేపల్లి క్రాస్ రోడ్ మీదుగా ఇల్లందుకు బయలుదేరారు.ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ విజ్ఞప్తి మేరకు ఉప ముఖ్యమంత్రి కారేపల్లి క్రాస్ రోడ్ వద్ద కారు దిగి స్థానిక నాయకులు,కార్యకర్తలను పలకరించారు.భాగ్యనగర్ తండా సర్పంచ్ భానోత్ హీరాలాల్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు మోటార్ సైకిల్ ర్యాలీగా కారేపల్లి క్రాస్ రోడ్‌కు చేరుకుని భట్టికి ఘన స్వాగతం పలికారు. కార్యకర్తల నినాదాలతో ఆ ప్రాంతం సందడిగా మారింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు,కారేపల్లి సహకార సంఘం చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్,సర్పంచులు మేదరి వీర ప్రతాప్(టోనీ), ఇస్లావత్ రాజు,వాంకుడోత్ హనుమంతరావు,హేమలత,కాంగ్రెస్ నాయకులు బానోత్ రామ్మూర్తి,బానోత్ దేవ్లా నాయక్,అడ్డగోడ ఐలయ్య,పెద్దబోయిన ఉమాశంకర్,గుడిపూడి తిరుమలరావు,నర్సింగ్ శ్రీనివాసరావు,విష్ణువర్ధన్ రెడ్డి,యాకూబ్ అలీ,నాగండ్ల జగన్,అజ్మీర నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి మహిళలపై దాడిని ఖండిస్తూ రైతు సంఘం నిరసన




- దాడికి పాల్పడిన అటవీ అధికారులను సస్పెండ్ చేసి కేసులు నమోదు చేయాలి
- గుగులోతు తేజ నాయక్

**టీ మీడియా,జులై19,సింగరేణి(కారేపల్లి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మనుబోతులగూడెంలో పోడు సాగు చేస్తున్న ఆదివాసి మహిళలపై అటవీ శాఖ అధికారులు దాడి చేశారంటూ అఖిల భారత ఐక్య రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సింగరేణి మండలం పోలంపల్లి గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యుడు గుగులోతు తేజ నాయక్ మాట్లాడుతూ,పోడు సాగు చేస్తున్న ఆదివాసి మహిళలపై భౌతిక దాడులు జరగడం తీవ్రంగా ఖండనీయమన్నారు.దాడిలో గాయపడిన మహిళలకు తక్షణ వైద్య సహాయం అందించి,ఘటనకు బాధ్యులైన అటవీ అధికారులను వెంటనే సస్పెండ్ చేయడంతో పాటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివాసులకు పోడు భూములకు పట్టాలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ప్రభుత్వం, ప్రస్తుతం అటవీ అధికారుల ద్వారా దాడులకు పాల్పడటం బాధాకరమన్నారు.తరతరాలుగా సాగు చేస్తున్న పోడు భూములను బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని కోరారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసుల హక్కులను కాపాడుతూ,పోడు భూములకు యుద్ధ ప్రాతిపదికన పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం డివిజన్ కమిటీ సభ్యుడు పులకాని సత్తిరెడ్డి,మండల కమిటీ సభ్యులు భూక్య నాగరాజు,రవి నాయక్,అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కమిటీ సభ్యులు రావుల నాగేశ్వరరావు, హరిదాస్ నాయక్, రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి

- ఆగస్టు 10 'జైల్ భరో'ను విజయవంతం చేయండి
- కారేపల్లిలో ప్రజాసంఘాల మండల సదస్సు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై నేతల విమర్శలు




**టీ మీడియా,జూలై19,సింగరేణి(కారేపల్లి):**
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు,ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు, సీఐటీయూ మండల కన్వీనర్ కే.నరేంద్ర డిమాండ్ చేశారు.ఆగస్టు 10న నిర్వహించే 'జైల్ భరో' కార్యక్రమాన్ని భారీగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఆదివారం కారేపల్లిలోని భాగం రామనరసయ్య భవన్లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం,సీఐటీయూ,రైతు సంఘాల ఆధ్వర్యంలో మండల సదస్సు నిర్వహించారు.వజ్జా రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా మార్పులు తీసుకువచ్చి పేదల జీవనోపాధిపై దెబ్బ కొట్టిందని ఆరోపించారు.కార్మికులకు రక్షణగా ఉన్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మిక హక్కులను బలహీనపరిచిందని విమర్శించారు.రైతులు తీవ్రంగా వ్యతిరేకించిన వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకున్నప్పటికీ,అదే విధానాలను పరోక్షంగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాల్సిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పరోక్షంగా అదే దారిలో నడుస్తోందని విమర్శించారు.తెలంగాణలో రైతు డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఏర్పాటు ద్వారా భవిష్యత్తులో రైతులకు అందుతున్న ఉచిత విద్యుత్‌కు ముప్పు వాటిల్లే పరిస్థితులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలే ప్రత్యామ్నాయమని,పోరాటాల ద్వారానే పాలకులు ప్రజలకు అనుకూల నిర్ణయాలు తీసుకునే పరిస్థితి వస్తుందని అన్నారు.

ఈ నేపథ్యంలో ఆగస్టు 10న నిర్వహించే 'జైల్ భరో' కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు,రైతులు, కార్మికులు,ఉద్యోగులు, ఉపాధ్యాయులు,ప్రజాసంఘాల నాయకులు,ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సదస్సులో వ్యకాస మండల అధ్యక్షుడు కేసగాని ఉపేందర్,కార్యదర్శి యనమనగండ్ల రవి,బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు శనగ రాంబాబు,ఆశా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి వాంకుడోత్ కమల,స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గుంపెనపల్లి నరసింహారావు, ప్రజా సంఘాల నాయకులు ఎండి ఇస్మాయిల్,రేగళ్ల మంగయ్య, గుర్రం వెంకటేశ్వర్లు,అజ్మీర శోభన్,కల్తీ రామచంద్రయ్య, కరపటి సీతారాములు,తుమ్మోజు రామ్మూర్తి,తలారి దేవప్రకాశ్, షేక్ సైదులు,పాసిని నాగేశ్వరరావు,గంగాధరణి ఉపేంద్రచారి,చల్లా మల్లమ్మ, కరపటి అరుణ,ఎర్రిపోతు భద్రయ్య, పిప్పళ్ల కృష్ణ,మన్యం బ్రహ్మయ్య,రాచర్ల రణధీర్,కొమరయ్య,యాదగిరి,రాయమల్లు,షేక్ బందేలీ, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# 98 శాతం ఎస్ ఐ అర్ ప్రక్రియ పూర్తి

- బిఎల్‌ఏ దారపోగు

**టీ మీడియా, జులై 20 పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ 98శాతం పూర్తయిందని ఎస్సీ సెల్ మండల నాయకులు బిఎల్ఏ దారపోగు వెంకటేష్ తెలిపారు రంగాపురం గ్రామంలో మొత్తం 3100 మంది ఓటర్లు ఉండగా అందరి వివరాల డిజిటలైజేషన్ పూర్తి చేశామన్నారు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు రంగాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు బి రామచంద్ర రెడ్డి సూచన మేరకు ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని బిఎల్ఏ దారపోగు వెంకటేష్ తెలిపారు రంగాపూర్ గ్రామంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ 98శాతం పూర్తి చేసిన బూత్ లెవెల్ ఆఫీసర్లు (బి ఎల్ వో)బూత్ లెవెల్ ఏజెంట్ (బి ఎల్ ఎ) దారపోగు వెంకటేష్ లను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఫోన్ చేసి అభినందించినట్లు తెలిపారు అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదయ్యేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోనే సర్ ప్రక్రియలో 98శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసుకున్న మొదటి గ్రామంగా పెబ్బేరు మండలం లోని రంగాపురం గ్రామం గుర్తింపు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



# సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- దమ్మపేట--పాల్వంచ రహదారి విస్తరణకు శంకుస్థాపన

**టీ మీడియా, జులై 19,కొత్తగూడెం :**
మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దమ్మపేట పాల్వంచ ప్రధాన రహదారిలో జిల్లా ఖనిజ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధుల ద్వారా రూ.14 కోట్ల నిర్మాణ వ్యయంతో సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర రెండు లేన్ల రహదారిని నాలుగు లేన్ల రహదారిగా విస్తరించే పనులకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.అనంతరం మంచికంటి నగర్ హర్ష టౌన్‌షిప్‌లోని ఎస్‌కేటీ అపార్ట్‌మెంట్ నుంచి ప్రధాన రహదారి వరకు రూ.50 లక్షల నిర్మాణ వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.అలాగే కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి గోదుమవాగు వరకు రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సెంట్రల్ లైటింగ్, డివైడర్ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇవ్వడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పేదల సంక్షేమ కార్యక్రమాలను నిరంతరంగా అమలు చేస్తూనే, మౌలిక వసతుల అభివృద్ధి పనులను కూడా వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. అదే క్రమంలో కొత్తగూడెం--పాల్వంచ ప్రాంతంలో రహదారులు, పట్టణ మౌలిక సదుపాయాలు, పారిశ్రామికాభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో కూడా స్థానిక శాసనసభ్యులతో కలిసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.దమ్మపేట--పాల్వంచ రహదారి గత అనేక సంవత్సరాలుగా దెబ్బతిని ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని, పాల్వంచతో పాటు అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల ప్రజలు కూడా ఈ రహదారిపై ఆధారపడుతున్నందున అత్యవసరంగా డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.14 కోట్లను మంజూరు చేసి నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.పాల్వంచ ప్రాంతంలో భూ సమస్యలు, రిజిస్ట్రేషన్ సమస్యలు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ఇప్పటికే కొన్ని సర్వేలు పూర్తయ్యాయని, మిగిలిన సర్వేలను కూడా వేగవంతంగా పూర్తి చేసి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి తెలిపారు. సింగరేణి పరివాహక ప్రాంతాలకు సంబంధించిన జీవో--76 అంశంపై కూడా ప్రభుత్వం సానుకూలంగా పరిశీలన జరుపుతోందని, త్వరలోనే దీనిపై స్పష్టత ఇవ్వనున్నట్లు వెల్లడించారు.పాల్వంచ పారిశ్రామిక ప్రాధాన్యతను మరింత పెంచేందుకు కాలుష్య రహిత పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కొత్తగూడెం పరిసర ప్రాంతంలో విమానాశయం ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని చెప్పారు.జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటలు, మెట్ట పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేపట్టడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని, రైతులకు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.పేదల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వెనుకడుగు వేయడం లేదన్నారు. ప్రతి అర్హ కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డుల జారీ వంటి హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు.పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ గృహాల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నామని, మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్‌కు అదనంగా మరో లక్ష ఇళ్లను మంజూరు చేసి మొత్తం సుమారు 8 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఇప్పటికే లక్షన్నర ఇళ్లు పూర్తయ్యాయని, మరో రెండు లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, స్థానిక సంస్థలకు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్టీవో మధు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# కుమ్మర సంఘం కార్యవర్గానికి సన్మానం



**టీ మీడియా, జులై 19,పెబ్బేరు:**
పెబ్బేరు పట్టణంలో నూతనంగా ఎన్నికైన వనపర్తి జిల్లా కుమ్మర సంఘం నాయకులకు కుమ్మర సంఘం కమిటీ హాల్ లో ఘన సన్మానం నిర్వహించారు జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షుడు సుగురు రాములు ప్రధాన కార్యదర్శి సూర్యవంశం పరుశరాముడు అధ్యక్షులు సూర్యవంశం వెంకటస్వామి స్టీరింగ్ కమిటీ సభ్యులు బుద్ధారం నరసింహ బొడ్డుపల్లి నరసింహ పెబ్బేరు మండల అధ్యక్షుడు సూర్యవంశం హర్షవర్ధన్ పెబ్బేరు టౌన్ కమిటీ అధ్యక్షుడు సూర్యవంశం నాగన్న ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించి స్వీట్లు పంచి జిల్లా నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు జిల్లా అధ్యక్షులు సుగూరు రాములు మాట్లాడుతూ పూర్వకాలం నుంచి చేతి వృత్తిపరంగా బతికే వాళ్ళు ఇప్పుడు కాలానికి అనుగుణంగా మట్టి పాత్ర లను పక్కకు పెట్టి స్టీల్ పాత్రలు సిల్వర్ పాత్రలు వాడుతున్నారు తెలంగాణ ప్రభుత్వం దృష్టికి మన కులస్తుల సంఖ్య చూపించి కార్పొరేషన్ల ద్వారా పూర్వం లాగే మట్టిపాత్రలను తయారు చేసే యంత్రాలను కులస్తులకు ఇప్పించి కాలానికి అనుగుణంగా మట్టి పాత్రలు తయారుచేసే శిక్షణలు ఇప్పించే మార్గం చేస్తామని కార్పొరేషన్ల లోన్లు ప్రతి ఒక్కరికి వచ్చేలా సహకరిస్తామని ఆయన తెలిపారు జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యవంశం పరుశరాముడు మాట్లాడుతూ కుమ్మర కులస్తులు ఐక్యతతో పోరాడితే ఏదైనా సాధించవచ్చు అని అన్నారు మనం చేసే కుండ మానవుడు పుట్టినప్పుడు మాగి ముంత కావాలి మనిషి చనిపోయినప్పుడు తలగోరి కొట్టడానికి కుండ కావాలి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్దాం పోరాటం చేద్దాం సామాజిక కార్పోరేషన్లకు మంజూరు చేసే విధంగానే కుమ్మర కులానికి కార్పొరేషన్ చైర్మన్ గా ఏర్పాటు చేసి కుమ్మర లకు నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వనపర్తి రూరల్ మండల అధ్యక్షుడు శివ పెబ్బేరు మండల యూత్ అధ్యక్షులు సురేష్ సుగూరు గ్రామ అధ్యక్షుడు శివ పెబ్బేరు సంఘం ప్రధాన కార్యదర్శి కె పరుశరాముడు కె శ్రీనివాసులు పామాపురం ఉప సర్పంచ్ శ్రీనివాసులు కుమ్మర సంఘం నాయకులు వెంకటస్వామి నరేందర్ కర్ణ తేజ మహేష్ రమేష్ బుచ్చన్న నాగన్న యూత్ సంఘం సభ్యులు ధర్మ తేజ రవి రామకృష్ణ పవన్ శ్రీరాజ్ చింటూ శేఖర్ బన్నీ తదితరులు పాల్గొన్నారు

# రోడ్లపై కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లకు నో ఎంట్రీ

- డీటీఓ శంకర్ నాయక్



**టీ మీడియా, జులై 19,మహబూబాబాద్:**
రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని, కేజ్ వీల్స్ అమర్చుకుని ప్రజా రహదారులపై ప్రయాణించే ట్రాక్టర్లను గుర్తిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తామని మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) శంకర్ నాయక్ హెచ్చరించారు. రైతులు నిబంధనలు తప్పనిసరిగా పాటించి ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడంతో పాటు రోడ్డు భద్రతకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**పొలాల్లో మాత్రమే కేజ్ వీల్స్ వినియోగించాలి**

వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగించే ట్రాక్టర్లకు అమర్చే ఇనుప కేజ్ వీల్స్‌ను ప్రజా రహదారులపై వినియోగించరాదని డీటీఓ స్పష్టం చేశారు. కేజ్ వీల్స్‌ను పొలాల్లో మాత్రమే ఉపయోగించాలన్నారు. వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత వాటిని తొలగించి సాధారణ రబ్బరు టైర్లను అమర్చుకుని మాత్రమే రహదారులపై ప్రయాణించాలని సూచించారు.

**రోడ్లకు నష్టం.. ప్రమాదాలకు కారణం**

వ్యవసాయ భూముల్లో బురద నేలల్లో ట్రాక్టర్‌కు మెరుగైన పట్టును కల్పించేందుకు కేజ్ వీల్స్ ఉపయోగపడతాయి. అయితే వాటితో బీటీ, సీసీ, గ్రామీణ రహదారులపై ప్రయాణించడం వల్ల రోడ్ల ఉపరితలం తీవ్రంగా దెబ్బతింటుందని తెలిపారు. ఇనుప కేజ్ వీల్స్ కారణంగా రోడ్లపై గుంతలు ఏర్పడి, ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రహదారులు త్వరగా ధ్వంసమవడంతో పాటు ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులకు ప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికమవుతాయని పేర్కొన్నారు.

**ట్రైలర్‌లో తీసుకెళ్లి.. పొలం వద్దే అమర్చాలి**

రైతులు ఇంటి నుంచి పొలానికి వెళ్లే సమయంలో కేజ్ వీల్స్‌ను ట్రాక్టర్ ట్రైలర్ (తొట్టి)లో తీసుకెళ్లి, పొలం వద్ద మాత్రమే వాటిని అమర్చుకోవాలని సూచించారు. వ్యవసాయ పనులు పూర్తయిన అనంతరం కేజ్ వీల్స్‌ను తొలగించి రబ్బరు టైర్లను అమర్చుకుని తిరిగి రహదారులపై ప్రయాణించాలని తెలిపారు.

**ప్రజా ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత**

ప్రజా రహదారులను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, రహదారులు దెబ్బతినకుండా చూడటం ద్వారా ప్రభుత్వానికి భారీ నష్టం తప్పించడంతో పాటు ప్రమాదాలను కూడా నివారించవచ్చని డీటీఓ శంకర్ నాయక్ పేర్కొన్నారు. రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, రైతులు స్వచ్ఛందంగా నిబంధనలు పాటించి ప్రజా ప్రయోజనాలను కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు.





# ఆగస్టు లో మూడు నెలల రేషన్ బియ్యం



**టీ మీడియా, జులై 19,హైదరాబాద్:**
ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మరోసారి ప్రజా పంపిణీ వ్యవస్థ లో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసు కుంది,3 నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణ యం తీసుకున్నట్టు తెలుస్తుంది.. వచ్చే నెల ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబరు నెలలకు సంబంధిం చిన రేషన్ బియ్యా న్ని ఒకేసారి అందిం చనున్నారు. ఈ మేర కు కేంద్రం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయ టంతో ఆగస్టు 1 నుంచి మూడు నెలల బియ్యం పంపి ణీకి పౌర సరఫరాల శాఖ అధికారులు ఏర్పా ట్లు చేస్తున్నారు.సాధారణంగా ప్రతి నెల మొదటి 15 రోజులు మాత్రమే డీలర్లు రేషన్ బియ్యం ఇచ్చేవారు. వచ్చే నెలలో 3 నెలల రేషన్? ఒకేసారి ఇవ్వ నుండటంతో ఆగస్టు లో 31 రోజులు దుకాణాలు తెరచి బియ్యం అందించా ల్సి ఉంది. ప్రతి రేషన్ కార్డుదారు మూడు సార్లు వేలి ముద్రలు వేయాల్సి ఉంటుంది.

# అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం శ్రీకారం



● 33/11 కె.వి. విద్యుత్ ఉపకేంద్రానికి భూమిపూజ

**టి మీడియా, జులై 19 , కామేపల్లి:**
ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అడవి మద్దులపల్లి గ్రామంలో రూ. 2.85 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 33/11 కె.వి. విద్యుత్ ఉపకేంద్రానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ ఉపకేంద్రం ద్వారా ప్రాంత ప్రజలకు మరింత నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందే అవకాశం కలగనుంది.అనంతరం రూ. 3.95 కోట్ల వ్యయంతో తాళ్లగూడెం నుంచి నర్సయ్యకుంట వరకు (యం.పి.పి.యస్. పాఠశాల మీదుగా) చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.అలాగే రూ.5 కోట్ల అంచనా వ్యయంతో ఇల్లందు ఆర్‌డబీ రోడ్డు నుంచి కామేపల్లి స్మశాన వాటిక వరకు కామేపల్లి పెద్ద చెరువు మీదుగా నిర్మించనున్న బీటీ రహదారి పనులను ప్రారంభించారు.ఈ అభివృద్ధి పనుల ద్వారా విద్యుత్, రహదారి మౌళిక సదుపాయాలు మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా, సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, టీజీ ఎన్పిడిసిఎల్ ఎండి వరుణ్ రెడ్డి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీజీ ఎన్పిడిసిఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, సిఇ రాజు చౌహాన్, ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాస చారి, పీఆర్ ఎస్ఇ జి. వెంకట్ రెడ్డి, ఇఇ మహేష్ బాబు, కామేపల్లి తహసీల్దార్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

● అన్ని పార్టీల సహకారం కోరిన ఓం బిర్లా



**టి మీడియా, జులై 19 ,న్యూఢిల్లీ :**
పార్లమెంటు వర్షాకాల సమావేశాలు రేపటి నుంచి (సోమవారం జూలై 20) ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆదివారం నాడు 'బిజినెస్ అడ్వైజరీ కమిటీ' (దీూజ) సమావేశాన్ని నిర్వహించారు. సభ సజావుగా, హుందాగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆయన కోరారు. స్పీకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులతో పాటు అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యులు పాల్గొన్నారు. వర్షాకాల సమావేశాల్లో చేపట్టాల్సిన శాసన కార్యక్రమాలు, ప్రజా ప్రాధాన్య అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ప్రజా సమస్యలపై చర్చలకు ప్రాధాన్యం..
సమావేశంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడిన ఓం బిర్లా.. ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను సభలో ప్రస్తావించాలని కోరారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన విషయాలపై అర్థవంతమైన, నిర్మాణాత్మక చర్చలు జరగాలని సూచించారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించగా, జాతీయ ప్రాధాన్యం ఉన్న అనేక అంశాలపై సభలో చర్చ జరగాలని సూచనలు చేశారు. పార్లమెంట్ గౌరవాన్ని కాపాడేలా సభ్యులంతా వ్యవహరించాలని స్పీకర్ సూచించారు. చర్చలు సజావుగా సాగేందుకు, ప్రజలకు సంబంధించిన సమస్యలపై సమగ్రంగా చర్చించేందుకు అన్ని పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సభలో సమయం వృథా కాకుండా, ప్రతి అంశంపై తగిన సమయం కేటాయించేలా బిజినెస్ అడ్వైజరీ కమిటీ సిఫార్సులు చేస్తుందని తెలిపారు.

జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు సమావేశాలు
ఈ ఏడాది పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు ప్రతిపక్షాలు రాజకీయ, ఆర్థిక, పాలనాపరమైన అంశాలతో పాటు ప్రజా సమస్యలపై చర్చకు పట్టుబట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వర్షాకాల సమావేశాలు ఉత్కంఠభరితంగా సాగనున్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# ఆదివాసీల కుటుంబాలకి తీరని లోటు



● బాధిత కుటుంబాలకి పరామర్శల వెల్లువ

**టి మీడియా, జులై 19 , చింతూరు:**
పోలవరం (రంపచోడవరం) జిల్లా చింతూరు మన్యంలోని ఎటపాక మండలంలో శనివారం ఐదుగురు ఆదివాసీలు మృతి చెందిన విషాద ఘటనతో ఆ కుటుంబాలలో తీవ్ర విషాదం నెలకొంది. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబాలు కన్నీటి సంద్రంలో మునిగిపోయాయి.ఇంట్లో చిన్నారులు తండ్రి కోసం, భార్య తన జీవిత భాగస్వామి కోసం, వృద్ధ తల్లిదండ్రులు తమ కుమారుడి కోసం బోరున విలపిస్తున్న దృశ్యాలు ప్రతి ఒక్కరి హృదయాన్ని కలచివేస్తున్నాయి. కుటుంబానికి ఆర్థికంగా, మానసికంగా అండగా నిలిచిన వ్యక్తులు ఇక లేరనే విషాదం ఆ కుటుంబాలను తీవ్ర అనిశ్చితిలోకి నెట్టింది. చిన్నారుల చదువులు, కుటుంబ పోషణ, వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ వంటి బాధ్యతలు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారాయి. ఆ కుటుంబాల భవిష్యత్తు ఎలా ఉండబోతోందోనన్న ఆందోళన స్థానికులను, బంధువులను కలవరపెడుతోంది.

# కేఎంసీలో పారిశుద్ధ్య కుంభకోణం



● మాయమైన స్వచ్ఛ భారత్ రిక్షాలు, పరికరాలు
● అక్రమ లీజుల్లో డ్రెయిన్లు, రోడ్లు
● ప్రైవేట్ సేవల్లో చెత్త సేకరణ ట్రాక్టర్లు

**టిమీడియా, జులై 19 ,ఖమ్మం బ్యూరో :**
నకిలీ ఇంటి నంబర్లు, పన్నుల సృష్టి, ఆస్తి పన్నులో బడాబాబులకు భారీ తగ్గింపుల ద్వారా కోట్ల రూపాయల మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టి స్వాహా పర్వాలు బయటపడిన విషయం తెలిసిందే. అవి చాలవన్నట్లు ఇప్పుడు నగరంలో పారిశుద్ధ్య శాఖ పేరుతో భారీ కుంభకోణం జరుగుతున్నట్లు టి మీడియా పరిశీలనలో బయటపడింది.
ఈ అక్రమాల్లో రాజకీయ నేతల భాగస్వామ్యం కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మురుగు కాలువలు, మున్సిపల్ రోడ్లను అక్రమ లీజులకు ఇవ్వడంతో పాటు, చెత్త సేకరణ ట్రాక్టర్లను ప్రైవేట్ అవసరాలకు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది.
ఖమ్మం మున్సిపాలిటీగా ఉన్నప్పుడే ఈ అక్రమాలకు బీజం పడగా, కార్పొరేషన్‌గా మారిన తర్వాత కూడా అదే వరవడి కొనసాగుతోందని ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో ఆరోపణలు ఎదుర్కొని బదిలీపై వెళ్లిన కొందరు అధికారులు, సిబ్బంది తిరిగి అదే స్థానాలకు రావడం, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్లు కూడా వారే కావడం, కొందరు అధికారులు బినామీ పేర్లతో కాంట్రాక్టులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇవే అక్రమాలకు అడ్డాగా మారాయని పలువురు పేర్కొంటున్నారు.

స్వచ్ఛ భారత్ రిక్షాలు, పరికరాలు మాయం
మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్వచ్ఛ భారత్ మిషన్ కింద కొనుగోలు చేసిన రిక్షాలు, పారిశుద్ధ్య పరికరాలు, పబ్లిక్ టాయిలెట్లు, మొబైల్ టాయిలెట్ వాహనాలు చాలావరకు కనిపించకుండా పోయాయని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని మాత్రమే పిచ్చి మొక్కల మధ్య పడి కనిపిస్తున్నాయి. వినియోగంలో లేకపోయినా వాటి నిర్వహణ పేరుతో ఖర్చులు చూపుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

నిబంధనల ప్రకారం
ఇంటింటికీ చెత్త సేకరణ వాహనాలు ప్రతిరోజూ సేవలు అందించాలి.
నగరంలో అవసరమైన ప్రాంతాల్లో కమ్యూనిటీ, పబ్లిక్ మరుగుదొడ్లు అందుబాటులో ఉండాలి.
పాత బట్టలు, వస్తువులను దానం చేసేందుకు 'వాల్ ఆఫ్ కైండ్‌నెస్' ఏర్పాటు చేయాలి.
పారిశుద్ధ్య సమస్యలు, ఫిర్యాదులను 1969 టోల్-ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి తెలియజేయవచ్చు.

అవినీతి ఇలా...
నగరంలో అత్యంత రద్దీగా ఉండే వైరా రోడ్, బాలాజీ నగర్, కమాన్ బజార్ ప్రాంతాల్లో రోడ్ల లీజుల పేరిట అక్రమ వసూళ్లు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ డ్రెయిన్లు, ఫుట్‌పాత్‌లకు ప్రత్యేక రేట్లు నిర్ణయించి నెలకు లక్షల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం.
కొంతమంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అసలు విధులకు హాజరుకాకుండా అధికారులు, మాజీ కార్పొరేటర్ల ఇళ్లలో వ్యక్తిగత పనులు చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.




పనికి రాని స్థితి లో పబ్లిక్ టాయిలెట్స్



లీజుతో మూసి వేసిన రహదారి

సమయపాలన లేని ట్రాక్టర్లు
మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలు ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలి. అయితే కొన్ని ప్రాంతాల్లో మూడు, నాలుగు రోజులకోసారి మాత్రమే వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరికొన్ని చోట్ల మధ్యాహ్నం లేదా సాయంత్రం చెత్త సేకరణ జరుగుతోంది.
మార్కెట్లు, వాణిజ్య ప్రాంతాల్లో ఉదయం, రాత్రి రెండు పూటలా చెత్త సేకరణ జరగాల్సి ఉన్నప్పటికీ అది సక్రమంగా అమలు కావడం లేదని ఆరోపణలు ఉన్నాయి.
ఇదిలా ఉండగా, వాణిజ్య ప్రాంతాల్లోని వ్యాపారుల నుంచి నెలకు ఒక్కో దుకాణం వద్ద రూ.200 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారని, ఈ చెల్లింపులకు ఎలాంటి రసీదులు ఇవ్వడం లేదని సమాచారం. ఈ నగదు కొంతమంది వ్యక్తుల జేబుల్లోకే వెళ్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
(వాహనాల వినియోగం, డీజిల్, నిర్వహణ, మరమ్మతులపై పూర్తి కథనం మరో సంచికలో.)

# ఆశా వర్కర్ కుటుంబానికి ఆర్థిక సహాయం



**టీ మీడియా, జులై 19,దమ్మపేట:**
దమ్మపేట మండల కేంద్రానికి చెందిన శ్రీ గాయత్రీ వైద్యశాల మరోసారి తన మానవత్వాన్ని చాటుకుంది. పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలో ఆశా వర్కర్‌గా సేవలందిస్తున్న కొత్తూరు గ్రామానికి చెందిన కూరం శ్యామల అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఆమె కుటుంబం నిరుపేద కావడంతో దహన సంస్కారాలు నిర్వహించేందుకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న శ్రీ గాయత్రీ వైద్యశాల యాజమాన్యం వెంటనే స్పందించింది. మానవతా దృక్పథంతో కుటుంబ సభ్యులకు దహన సంస్కారాల నిమిత్తం ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచింది. ఈ సందర్భంగా స్థానికులు వైద్యశాల యాజమాన్యం చూపిన సేవా భావాన్ని అభినందించారు. సమాజానికి అవసరమైన సమయంలో చేయూతనందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రీ వైద్యశాల యాజమాన్యంతో పాటు వైద్యులు డా. పి. మౌనిక, డా. సాయికృష్ణ, డా. ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు. వారి సేవా స్ఫూర్తిని పలువురు కొనియాడారు.

# కోళ్ల ఫారంలో డ్రగ్స్ తయారీ గుట్టురట్టు

● కిలోకు పైగా అల్ప్రాజోలంను స్వాధీనం



**టి మీడియా, జులై 19 , మహబూబ్‌నగర్ :**
మహబూబ్‌నగర్ జిల్లా భూత్‌పూర్‌లోని ఓ కోళ్ల ఫారంలో గుట్టుగా నిర్వహిస్తున్న అల్ప్రాజోలం తయారీ కేంద్రాన్ని ఈగల్ ఫోర్స్, నార్కోటిక్స్ పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. దాడుల్లో కిలోకు పైగా అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్న పోలీసులు, ప్రధాన నిందితుడు మలేలా జయప్రకాశ్ గౌడ్‌తో పాటు మొత్తం 12 మందిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో గుర్తించిన మరో 23 మంది పరారీలో ఉండగా, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.భూత్‌పూర్‌లోని పౌల్ట్రీ ఫారంలో అక్రమంగా అల్ప్రాజోలం తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఈగల్ ఫోర్స్, నార్కోటిక్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించినట్టు పోలీసుల తెలిపారు. ఈ సందర్భంగా భారీ మొత్తంలో ముడి రసాయనాలు, తయారైన అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకుని తయారీ యూనిట్‌ను ధ్వంసం చేశారు. ఈ ఘటనపై హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.
ప్రధాన నిందితుడు మలేలా జయప్రకాశ్ గౌడ్ 2025లో బోయిన్‌పల్లి ప్రాంతంలో అల్ప్రాజోలం తయారీ కేసులో అరెస్టై ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బెయిల్‌పై విడుదలైన అతడు స్వగ్రామమైన భూత్‌పూర్‌లో మళ్లీ డ్రగ్స్ తయారీ ప్రారంభించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో కృష్ణయ్య గౌడ్ మరో కీలక నిందితుడిగా ఉన్నాడని, అతడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతడు పలుమార్లు ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించినట్లు వెల్లడించారు.

తాటి కల్లులో కల్తీకి వినియోగం
దర్యాప్తులో నిందితులు తాటి కల్లులో కల్తీ చేయడానికి అల్ప్రాజోలంను తయారు చేస్తున్నట్లు వెల్లడించారని ఈగల్ ఫోర్స్ అధికారులు తెలిపారు. డ్రగ్స్ తయారీకి అవసరమైన రసాయనాలను జీడిమెట్ల, ప్రశాంత్‌నగర్, ఫతేనగర్, బాలానగర్ ప్రాంతాల నుంచి సరఫరా చేసినట్లు గుర్తించారు. పరారీలో ఉన్న రసాయనాల సరఫరాదారులు, వ్యాపారులను కూడా గుర్తించామని, డ్రగ్స్ తయారీకి సహకరించిన ప్రతి ఒక్కరిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈగల్ ఫోర్స్ స్పష్టం చేసింది.

# కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మహిళల బోనాల ర్యాలీ



**టి మీడియా, జులై 19 , మంచిర్యాల :**
మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లో ఉన్న శ్రీశ్రీశ్రీ కాళీమాత అష్టకాలభైరవ గణపతి దేవాలయంలో ఆషాఢమాస బోనాల జాతర ఉత్సవాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు, కార్పొరేటర్ నల్ల శంకర్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.బోనాల జాతర సందర్భంగా కుమ్మరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపెల్లి రమేష్ ఆధ్వర్యంలో జిల్లా కుమ్మరి సంఘం మహిళలు హమాలివాడలోని పోచమ్మ ఆలయం నుంచి బోనాలను ఎత్తుకుని కాళీమాత ఆలయం వరకు సంప్రదాయ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు సతీమణి, మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు.వేడుకల్లో మున్సిపల్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య--మహేష్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.